సాక్షి
కాకినాడ
గురువారం । 31 । ఆగస్టు । 2023



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు వెంకట్రామన్నగూడెంకు చెందిన బోడపూడి వీర వెంకట రాఘవయ్య, ఉషారాణి దంపతులు బుధవారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 2,02,158 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.40 అడుగులకు నీటి మట్టం చేరింది.

ఉత్తరం రాద్దాం.. బహుమతి పొందుదాం



నేటి సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. ఐదు దశాబ్దాల ముందుకు వెళితే ఉత్తర ప్రత్యుత్తరాలు కేవలం లేఖల ద్వారానే జరిగాయి.

8లో

కౌలు రైతులకూ ఆర్థిక భరోసా



- నేడు ఖాతాల్లో వైఎస్సార్ రైతు భరోసా జమ
- జిల్లాలో11534 మందికి ప్రయోజనం
- ఖాతాల్లో జమ కానున్న మొత్తం రూ.8.65 కోట్లు
- వరుసగా ఐదో ఏడాదీ ఆర్థిక సహాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): కౌలు రైతులకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోంది. అర్హత కల్గిన ప్రతీ కౌలు రైతుకు సాగు చేసుకొనేందుకు వైఎస్సార్ రైతు భరోసా అందిస్తోంది. జిల్లాలో అర్హులైన 11 564 మంది కౌలు రైతుల ఖాతాల్లో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.8.65 కోట్లు జమ చేయనున్నారు. రూ.7500 వంతున ఆర్థిక సాయం అందనుంది. దీంతో కౌలు రైతులలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఊడ్పులు చేపట్టిన సమయంలో తమకు పంట పెట్టుబడులకు తోడ్పాటు అందిస్తున్నందుకు వీరంతా సంతోషిస్తున్నారు.

నాడు కష్టాలను కళ్లారా చూసి..

విపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో కౌలు రైతుల కష్టాలు స్వయంగా తెలుసుకున్నారు. కంటి తుడుపుగా కాకుండా పక్కాగా సాయమందించే చర్యలు తీసుకుంటానని వీరికి హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వ్యవసాయ రంగంలో కీలక భూమిక పోషిస్తున్న వీరికి కార్డులు జారీ చేసేందుకు ఆదేశాలిచ్చారు. ఫలితంగా మునుపెన్నడూ లేనంతగా వెంటనే కార్డులు చేతికి అందాయి. అంతేకాదు కౌలు రైతుల కోసం ప్రత్యేకించి చట్టాన్ని చేశారు. సాగుదారుల హక్కుల రక్షణ చట్టంతో భూ యజమానులకు నష్టం కలుగని రీతిలో కౌలు రైతులకు మేలు చేశారు. 11 నెలలు చెల్లుబాటు అయ్యేలా కౌలు కార్డులు ఇస్తున్నారు. దీంతో భూ యజమానికి కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చేశారు.

భూ యజమాని మాదిరిగా ప్రయోజనాలు

కౌలు తీసుకొని సాగు చేసే రైతులకు పంట నష్టం ,బీమా, బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు కౌలు గుర్తింపు కార్డులు ఉపకరిస్తున్నాయి. గతంలో కౌలు కార్డులు పెద్దగా ఉపయోగపడేవి కాదు. అలాంటిది భూ యజమానికి వర్తించే ప్రయోజనాలన్నీ వీరికీ అందజేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు కార్డులు ఉన్న రైతులకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంట నష్టం సంభవిస్తే సంబంధిత కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతోంది. గుర్తింపు కార్డులు అధారంగా ప్రతీ రైతుకు పంట రుణాలు మంజూరు చేస్తున్నారు.

టీడీపీ హయంలో కష్టాలు

టీడీపీ హయాంలో కౌలు రైతులకు సహాయం చేసిన దాఖలాలు లేవు. కౌలు గుర్తింపు కార్డులు లేనేలేవు. పంట నష్టం వచ్చినా ఆ నష్ట పరిహారం భూ యజమాని అయిన రైతుల ఖాతాల్లో జమయ్యేవి. కొన్ని సందర్భాల్లో కౌలు రైతులకు అసలు పంట బీమా అందేది కాదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే కౌలు రైతులు ఎంతో నష్టపోయేవారు. భూ యజమానులకు మాత్రం శిస్తు చెల్లించేవారు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ఫలితంగా కౌలు అంటే కష్టాలు అనే భావన కలిగేలా పరిస్థితి తయారైంది. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం 11 నెలల పాటు కౌలు కార్డు చెల్లుబాటయ్యేలా గుర్తింపు కార్డులు అందించి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకంలో ఏటా భూ యజమానులైన రైతులకు మాత్రమే రూ.6 వేలు జమ చేస్తుంది. కౌలు రైతులకు మాత్రం ఈ పథకం వర్తించేది కాదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. కౌలు రైతులకు కూడా ఏటా రూ.7500 సాయం అందేలా చర్యలు తీసుకుంది. దీంతో పెట్టుబడికి ఇది ఆర్థిక సహాయంగా నిలుస్తోంది.

ప్రభుత్వం సహాయం మరువలేనిది



ప్రస్తుతం వరి ఊడ్పులు ఊడ్చాను. ఊడ్చిన పొలానికి ఎరువు వేయాలి. చేతిలో డబ్బులు లేవు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం రూ 7500 నా ఖాతాలో జమ చేస్తుండడం ఆనందంగా ఉంది. పెట్టుబడి కోసం ఎవరి వద్దకు వెళ్లి అప్పు అడిగే అవసరం లేకుండా ప్రభుత్వమే మాకు సహాయం చేస్తుంది.

– కుంచే దేవుడు, కౌలు రైతు పనసపాడు, సామర్లకోట మండలం

మమ్మల్ని ఈ ప్రభుత్వమే గుర్తించింది



కౌలు రైతులను జగన్ ప్రభుత్వం గుర్తించింది. గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా పంటల బీమా, రుణాలు ఇచ్చేలా చూస్తోంది. బయట అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొనే పరిస్థితి నుంచి గట్టెక్కించింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులను ఆదుకొంటున్నారు.

– వల్లు వెంకటరమణ,కౌలు రైతు, కరప.

న్యూస్‌రీల్

అన్నదాన పథకానికి రూ.రెండు లక్షల విరాళం



విరాళం అందజేసిన భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి చెన్నైకు చెందిన యర్రబోలు సత్యజగన్నాథరావు, విజయ దంపతులు బుధవారం రూ. రెండు లక్షల విరాళం అందజేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావుకు చెక్కును అందజేశారు. కర్రి వెంకట్రాజు, ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న పాల్గొన్నారు.

గర్భిణుల రక్తహీనతపై ప్రత్యేక దృష్టి

కాకినాడ సిటీ: జిల్లాలో గర్భిణుల రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాల్య వివాహాలు అరికట్టే దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై విద్య, వైద్య, స్త్రీ శిశుసంక్షేమశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రతి బుధ, శనివారాల్లో బాలబాలికలకు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. గర్భిణుల రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించి వివిధ శాఖల సమన్వయంతో లోపాలను సరిదిద్దుకోవాలన్నారు. మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆర్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు వివిధ శాఖల సమన్వయంతో నూరు శాతం సాధించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. లింగ నిష్పత్తి తక్కువ ఉన్న మండలాల్లో వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బందితో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, డీఐవో, సీడీపీవోలు, ఎంఈవో, ఆర్బీఎస్‌కె కోఆర్డినేటర్, నోడల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

రాఖీ కట్టేందుకు వెళుతూ గాయాల పాలైన యువకుడు

అన్నవరం/కాకినాడ క్రైం: రాఖీ కట్టేందుకు వెళుతూ ఓ యువకుడు ఫ్లాట్‌ఫారమ్‌కు రైలుకు మధ్య పడి తీవ్రంగా గాయపడిన వైనమిది. అన్నవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి శ్యాము త్రినాథరావు బుధవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం... చెన్నైలో ఉంటున్న ఎం గోపీకృష్ణ తన చెల్లికి రాఖీ కట్టేందుకు బుధవారం ఉదయం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో గాజువాక బయలుదేరాడు. అన్నవరం రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫారమ్‌లో వాటర్ బాటిల్ కోసం దిగాడు. వాటర్ బాటిల్ కొంటుండగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కదిలిపోవడంతో హడావిడిగా ఎక్కబోయాడు. ఈ ప్రయత్నంలో రైలు, ప్లాట్‌ఫారమ్ మధ్యలో జారి పడిపోయాడు. గోపీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన చూసి ప్రయాణికులు గట్టిగా కేకలు వేశాడు. వెంటనే రైల్లే హెడ్ కానిస్టేబుల్ శ్యాము త్రినాథరావు, కానిస్టేబుల్ ప్రకాష్ రైలు ఆపి అతడిని బయటకు తీశారు. అప్పటికే అతని ఎడమకాలు నుజ్జు నుజ్జు అయింది. కాకినాడ ఆస్పత్రికి తరలించగా దెబ్బతిన్న కాలి భాగాన్ని వైద్యులు తొలగించారు. చేతులకు.. తలకు కూడా గాయాలయ్యాయి.

నేటితో ముగియనున్న వనదుర్గమ్మ జాతర



క్షేమంకరిదేవి అలంకారంలో పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరి దుర్గామాత వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం చండీ, ప్రత్యంగిర హోమాలు చేసి, పూర్ణాహూతి సమర్పించనున్నట్టు పండితులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్, భక్తులు హాజరవుతారని తెలిపారు. జాతర మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం వనదుర్గ అమ్మవారు క్షేమంకరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారిని క్షేమంకరిదేవిగా అలంకరించి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీ దేవి రూపమైన క్షేమంకరి దేవిని గణనాథుడు సేవిస్తున్నట్టుగా అలంకరించడంతో అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు సాయంత్రం లక్ష కుంకుమార్చన, చండీహోమం చేశారు. మంత్రపుష్పాలు, ప్రసాదాలు నివేదించారు.ఈ పూజా కార్యక్రమాలను వేదపండితులు గంగాధరభట్ల గంగబాబు, యనమంద్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి పురుషోత్తం, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, ప్రథమశ్రేణి వ్రతపురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్, ఆలయ అర్చకులు చిట్టెం వాసు, నగేష్ నిర్వహించారు.

ఇర్రిపాకలో సీఎం జగన్ సందడి



కల్యాణవేదిక వద్దకు వస్తున్న ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న అభిమానులు





సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్ కృతికా శుక్లా



సీఎం జగన్‌కు రాఖీ కడుతున్న కాకినాడ ఎంపీ వంగా గీత

- ఎమ్మెల్యే చంటిబాబు కుమార్తె వివాహం సందర్భంగా నూతన వధూవరులకు ఆశీర్వాదం
- ముఖ్యమంత్రిని చూసేందుకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు

గోకవరం: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సందడి చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె పద్మశ్రీ అన్నపూర్ణ వివాహ వేడుక సందర్భంగా నూతన వధూవరులు పద్మశ్రీ అన్నపూర్ణ, సాయిఆదర్శ్ దంపతులను ఆశీర్వదించడానికి హెలికాప్టర్‌లో ఉదయం 11.40 గంటలకు జగ్గంపేట మండలం ఇర్రిపాక చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద సీఎంకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే చంటిబాబు ఇంటికి చేరుకున్న సీఎంను పూర్ణకుంభం, మేళతాళాలతో ఘనంగా ఆహ్వానించారు. నూతన వధూవరులు పద్మశ్రీఅన్నపూర్ణ, సాయి ఆదర్శ్ దంపతులను సీఎం ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం ఇర్రిపాక వస్తున్నారన్న సమాచారంతో నియోజకవర్గం నుంచే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున అభిమానులు ఆయన్ను చూసేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు సీఎంకు వినతులు అందించారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో సీఎం హెలికాప్టర్‌లో తాడేపల్లికి తిరుగుపయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పీవీ మిధున్‌రెడ్డి, మంత్రులు పినిపే విశ్వరూప్, తానేటి వనిత, చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీలు వంగా గీత, మార్గాని భరత్, చింతా అనురాధ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కె.పద్మశ్రీ, వి.కళ్యాణి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజా, పెండెం దొరబాబు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పర్వత పూర్ణచంద్రప్రసాద్, కొండేటి చిట్టిబాబు, నాగులాపల్లి ధనలక్ష్మి, శ్రీనివాసనాయుడు, పొన్నాడ సతీష్‌కుమార్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, దవులూరి దొరబాబు, పి.అమ్మాజీ, తాడి విజయభాస్కర్‌రెడ్డి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్లు కృతికాశుక్లా, మాధవీలత, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఏఎస్పీ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



కల్యాణవేదిక వద్దకు వస్తూ అభిమానులకు ముఖ్యమంత్రి జగన్ అభివాదం

హమ్మయ్య.. బండ భారం తగ్గింది

- గృహావసర గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గింపు
- 'ఉజ్వల' లబ్ధిదారులకు రూ.400
- జిల్లాలో 6,10,042 మహిళలకు రూ.12.74 కోట్ల భారం నుంచి విముక్తి



రాయవరం: మహిళలకు కేంద్ర ప్రభుత్వం రాఖీ పండగ కానుకగా తీపి కబురు అందించింది. గృహావసర గ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గిస్తూ మంగళవారం నిర్ణయం వెలువరించింది. ప్రధానమంత్రి ఉజ్వల స్కీం లబ్ధిదారులకు మరో రూ.200 తగ్గించాలని సంకల్పించింది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 6,10,042 మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది. భారీగా పెరిగిన వంట గ్యాస్ ధరతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ నిర్ణయం కొంత ఊరటనిచ్చింది. తక్షణమే అమల్లోకి రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో లబ్ధిని పొందే వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.200 తగ్గింపు

గృహావసరానికి వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం జిల్లాలో రూ.1,132 ఉంది. దీపం, జనరల్ లబ్ధిదారులకు రూ.200 తగ్గడంతో ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.932గా ఉంది. ఉజ్వల లబ్ధిదారులకు ఒక్కో సిలిండర్ ధర రూ.732గా ఉంటుంది. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పాటు వంట గ్యాస్ ధర భారీగా ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతోంది. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ సిలిండర్ ధర తగ్గించాలని నిర్ణయించింది. జనరల్ కనెక్షన్ లబ్ధిదారులకు ఇది వరకు రూ.200 సబ్సిడీని అందిస్తుండగా తాజాగా మరో రూ.200 ఇవ్వనున్నట్లుగా ప్రకటించింది. దీంతో వారికి ఒక్కో సిలిండర్‌పై రూ.400 తగ్గనుంది. మధ్య తరగతి కుటుంబం సగటున 45 రోజులకు ఒక సిలిండర్ ఉపయోగిస్తుండగా, ఉజ్వల కనెక్షన్‌దారులు మూడు నెలలకు ఒకటి వంతున ఉపయోగిస్తున్నట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని గ్యాస్ కనక్షన్లకనుగుణంగా ప్రతి నెలా సుమారుగా 3.40 లక్షల సిలిండర్లు వినియోగిస్తున్నట్లుగా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

లైసెన్స్ లేని హోటల్ మూసివేత

అనుమతులు మంజూరైన తర్వాతే తెరవాలని నోటీసు

తుని రూరల్: తేటగుంట సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హోటల్ వైరాను మూసివేశారు. మంగళవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ, కార్మికశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించిన విషయం తెలిసిందే. హోటల్ నిర్వహణకు అనుమతులు లేకపోవడం, అందులో పని చేసే సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించకపోవడం, ప్రమాదకరమైన రసాయనిక రంగులు, డీప్ ఫ్రీజ్‌లో నిల్వ మాంసపు ఆహార పదార్థాలను వినియోగిస్తుండడాన్ని అధికారులు గుర్తించారు. అనుమతులు మంజూరయ్యే వరకు హోటల్‌ను మూసివేయాలని ఆదేశిస్తూ ఫుడ్ సేఫ్టీ, కార్మికశాఖ అధికారుల నివేదిక ఆధారంగా పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు ఉత్తర్వులు ఇచ్చారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వాణిజ్య లైసెన్సు, అగ్నిమాపక, ఫుడ్ సేఫ్టీ, కార్మికశాఖ అధికారుల అనుమతులు పొందిన తర్వాతే హోటల్ తెరవాల్సి ఉంది.



అనుమతులు పొందిన తర్వాతే హోటల్‌ను తెరవాలని ఆర్డీవో జారీ చేసిన ఉత్తర్వులను యజమానికి అందజేస్తున్న వీఆర్వో, కార్యదర్శులు

ఆన్‌లైన్‌లో పారా మెడికల్ కోర్సులకు మెరిట్ జాబితా

కాకినాడ క్రైం: 2023–24 విద్యా సంవత్సరానికి పారా మెడికల్ డిప్లొమా కోర్సులకు గత నెల 30న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు కళాశాల పర్యవేక్షణాధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు http://rmckakinada.com వెబ్‌సైట్‌కు లాగిన్ అయి తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించుకోవాలని సూచించారు. అభ్యంతరాలుంటే వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు రంగరాయ వైద్య కళాశాలలోని జీ1 సెక్షన్‌లో పారామెడికల్ విభాగాన్ని నిర్వహిస్తున్న సంబంధిత అధికారిని సంప్రదించాలని కోరారు.

ఖైదీ మృతిపై ఐదో తేదీన మెజిస్టీరియల్ విచారణ

కాకినాడ సిటీ: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఖైదీ మృతిపై వచ్చేనెల ఐదో తేదీన మెజిస్టీరియల్ విచారణ నిర్వహించనున్నట్టు ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. డిటెన్యూ ఖైదీగా ఉన్న గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన బొంతు రమణ అనారోగ్యంతో జీజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతూ 2022, సెప్టెంబర్ 27న మరణించారని ఆయన తెలిపారు. ఈ విషయమై స్థానిక వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ నిర్వహించనున్నట్టు తెలిపారు. మృతుని రక్త సంబంధీకులకు, బంధువులకు, పోలీసులకు, వైద్యులకు, విచారణకు హాజరయ్యేలా నోటీసులు జారీ చేసినట్లు ఆర్డీవో తెలిపారు. ఐదో తేదీ ఉదయం 11 గంటలకు తన ఎదుట హాజరు కావాలన్నారు.

In Memoriam
"Precious in the sight of the LORD is the death of his faithful servants" Psalm 116:16



Mr. D.Prakasha Rao
DOB : 06-02-1945 DOD : 31-08-2022
We thank GOD for your prayers, love and discipline
Miss you beyond measure
with fond memories
Cecil, Paul and extended families

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: స్థానిక పాయకరావుపేట ఇందిరాకాలనీ సమీపంలో రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని, మృతికి కారణాలు తెలియలేదన్నారు. లేత పసుపు రంగు ఫుల్ చేతుల షైజామా, ముక్కుపొడి రంగుపై సిమెంట్ రంగు నిలువు చారల లుంగీ, కుడి చేతికి వెండి కడియం, చేతి వేళ్లకు వేంకటేశ్వరస్వామి ఇత్తడి ఉంగరాలు ఉన్నాయన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

3న జిల్లాస్థాయి ఈత పోటీలు

సబ్‌జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో శ్రీప్రకాష్ స్విమ్మింగ్ చాంపియన్స్ ట్రోఫీ -2023 నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ఐ.రాజు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాలురు, బాలికల విభాగల్లో నిర్వహించే పోటీలలో గ్రూప్-1లో 2008, 2009, 2010, గ్రూప్-2లో 2011, 2012, గ్రూప్-3లో 2013, 2014, గ్రూప్-4లో 2015 తరువాత జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సెప్టెంబర్ 1 శుక్రవారం సాయంత్రంలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వివరాలకు 91822 18669 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా మంజూరైన భూ పట్టాలు రద్దు

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద నిబంధనలకు విరుద్ధంగా, అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా 2007లో మంజూరైన పట్టాలను రద్దు చేశారు. అర్హులైన వారుంటే విచారణ చేసి పట్టాలు మంజూరుకు అవకాశం కల్పిస్తూ రెవెన్యూ అధికారులు నోటిసులు జారీచేశారు. వివరాల్లోకి వెళితే బెండపూడి రెవెన్యూ పరిధిలో 51.92 ఎకరాలను 73 మందికి పట్టాలుగా 2007లో మంజూరు చేశారు. వీరిలో 66 మంది బీసీలు, ఏడుగురు ఇతర కులాలవారు ఉన్నారు. నిబంధనలు పాటించకుండా మంజూరు చేసిన పట్టాలను రద్దు చేస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు అసైన్‌మెంట్ కమిటీ లబ్ధిదారులకు నోటీసులు జారీచేసింది. వీరిలో అర్హులైనవారుంటే ఆధారాలతో పెద్దాపురం ఆర్డీఓకు దరఖాస్తు చేసుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నామని తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఉత్తరం రాద్దాం.. బహుమతి పొందుదాం

- లేఖా రచనను ప్రోత్సహించేందుకు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు
- విజేతలకు విలువైన బహుమతులు
- విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా తపాలా శాఖ



అమలాపురం హెడ్ పోస్టాఫీసు

రాయవరం: నేటి సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, ఈ-మెయిల్స్, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. ఐదు దశాబ్దాల ముందుకు వెళితే ఉత్తర ప్రత్యుత్తరాలు కేవలం లేఖల ద్వారానే జరిగాయి. దూర ప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారం ఉత్తరం, టెలిఫోన్, టెలిగ్రామ్ ద్వారా తెలుసుకునే పరిస్థితి ఉండేది. సెల్‌ఫోన్ వినియోగం తర్వాత ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ వాడకం తర్వాత సమాచార వ్యవస్థలో విప్లవం వచ్చిందని చెప్పవచ్చు. నేటి తరానికి ఇంచుమించుగా ఉత్తరం అంటే తెలియని పరిస్థితి ఉంది. అందుకే ఉత్తరాన్ని తిరిగి పరిచయం చేసేందుకు, తెలిసిన వారికి మరోసారి గుర్తు చేసేందుకు తపాలా శాఖ నడుం బిగించింది. లేఖరులకు పోటీ పెడుతోంది.

'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా'

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను, పేపరు తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కానరాదు. మొబైల్ ఫోన్ ద్వారా సమస్త సమాచారాన్ని క్షణాల్లో వివిధ మార్గాల్లో చేరవేస్తున్నారు. ఫోన్‌లోనే ప్రత్యక్షంగా వాయిస్‌కాల్, వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుకునే పరిస్థితి ఉంది. ఖండాంతరాల్లో ఉన్న వారితో సైతం వీడియో కాల్ ద్వారా మాట్లాడే పరిస్థితి ఉండడంతో లేఖల ద్వారా ఉత్తర, ప్రత్యుత్తరాలను మర్చిపోయిన పరిస్థితి ఉంది. ఒకప్పటి సమాచార సాధనమైన ఉత్తరాన్ని నేటి యువతరానికి గుర్తు చేసేందుకు తపాలా శాఖ లేఖారచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఢాయి ఆఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

అమలాపురం డివిజన్ పరిధిలో..

హెడ్ పోస్టాఫీసులు	: 02
సబ్ పోస్టాఫీసులు	: 39
బ్రాంచి పోస్టాఫీసులు	: 197

రెండు విభాగాల్లో

ఈ పోటీల్లో భారతదేశ పౌరులు పాల్గొనవచ్చు. 18 ఏళ్ల లోపు వారికి ఒక కేటగిరిగా, 18 ఏళ్ల పైబడిన వారిని మరొక కేటగిరిగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను అందులో పొందుపర్చారు. ఎ4 సైజ్ పేపరుపై రాసి ఎన్వలప్ కవర్‌లో ఉంచి పంపించవచ్చు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌ల్యాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్ సాధనాల్లో టైప్ చేసిన లేఖలను పోటీకి అనుమతించరు. చేతితో రాసి వ్యాసం పంపాలి. లేఖలను పంపించేవారు వారి వయసును నిర్ధారిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పోటీలో గెలిస్తే వారి వయసు, ఐడీ ధృవీకరణకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలను స్థానిక పోస్ట్ మేన్‌లు సేకరించి, స్టేట్ ఆఫీస్‌కు 'ది చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ-520013 చిరునామాకు పంపిస్తారు. అక్టోబరు 31లోగా పంపించాలి.

బహుమతులిస్తారిలా..

రెండు కేటగిరీల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (12 మందికి మించకుండా) నగదు బహుమతులు అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు వరుసగా రూ.25 వేలు, రూ.10వేలు, రూ.5వేలు ఇస్తారు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల వారికి వరుసగా రూ.50వేలు, రూ.25వేలు, రూ.10వేలు నగదును అందిస్తారు.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

తపాలాశాఖ రూపొందించిన ఉత్తరాల పోటీ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సదవకాశం. విద్యార్థులే కాకుండా వయసుతో పనిలేకుండా ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇచ్చిన అంశానికి సంబంధించి స్వదస్తూరీతో వ్యాసం రాసి పోస్ట్ చేయాలి. దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.



– శ్రీధర్, పోస్టల్ సూపరింటెండెంట్, అమలాపురం

రెండు విధాలుగా ప్రయోజనం

విద్యార్థులకు ఇటువంటి పోటీ నిర్వహించడం వలన ఉత్తరాన్ని పరిచయం చేసినట్లవుతుంది. వారిలో పోటీ తత్వం పెరుగుతుంది. డిజిటల్ యుగంలో స్వదస్తూరీతో ఉత్తరాలు రాయడం అంటే చాలా మందికి తెలియదు. దీనివలన ఉత్తరాలు రాసే అలవాటు కూడా పెరుగుతుంది.



– కురుపూడి విఠల్‌నాథ్, హెడ్ పోస్ట్‌మాస్టర్, రామచంద్రపురం

వివాహిత దుర్మరణం



ఈదరపల్లిలో మోటారు సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టరు

అమలాపురం టౌన్: మండలంలోని ఈదరపల్లి గ్రామంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందుపల్లికి గ్రామానికి చెందిన జల్లి వాణి (30) అనే వివాహిత దుర్మరణం చెందింది. పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు వాణితోపాటు భర్త నాగేంద్ర, ఆమె ముగ్గురు పిల్లలతో మోటారు సైకిల్‌పై ఉప్పలగుప్తం బంధువులు ఇంటికి వెళ్లారు. ఆ గ్రామం నుంచి తిరిగి ఇందుపల్లి వచ్చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈదరపల్లి వంతెన దిగువ నుంచి ఓ ఇసుక లోడు ట్రాక్టర్ వెళుతుండగా భర్త నడుపుతున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో మోటారు సైకిల్‌పై ఉన్న భార్య వాణి ఆందోళనకు గురై సీసీ రోడ్డుపై పడింది. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో వాణి మృతి చెందినట్లు సీఐ దుర్గాశేఖరరెడ్డి తెలిపారు. భర్త నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. నాగేంద్ర కుటుంబం కూలీనాలీ చేసుకుని బతికే పేద కుటుంబం. పదేళ్ల లోపు ఉన్న వారి పిల్లలు తల్లి మరణంతో ప్రమాద స్థలంలో తల్లడిల్లిపోయారు. భర్త, పిల్లలు ఆమె మరణంతో గుండెలవిసేలా రోదించారు.

తైక్వాండో ఓపెన్ నేషనల్స్‌కు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో చీఫ్ కోచ్ శ్రీనివాసకుమార్, కోచ్ అర్జునరావు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు జరిగే తైక్వాండో ఓపెన్ నేషనల్స్‌కు కాకినాడ జిల్లా క్రీడాకారులు హాజరువుతున్నారని జిల్లా తైక్వాండో కోచ్ బి.అర్జునరావు బుధవారం తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్.మోక్షన్య, బి.శ్రీస్నేహ, వై.సాక్షియాదవ్, జి.యస్విత, బి.నాగదీపక్ చరణ్, బి.హర్షవర్ధన్ ఈ పోటీలకు ఎంపికయ్యారన్నారు. కాకినాడ శ్రీనగర్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులను చీఫ్‌కోచ్ శ్రీనివాస్‌కుమార్ బుధవారం కలిసి వారికి తగిన సూచనలు అందించారు. కోచ్ బి.అర్జునరావు మాట్లాడుతూ జాతీయస్థాయి ఓపెన్ నేషనల్స్‌కు తన వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. జట్టుకు కోచ్‌గా బి.అఖిల హాజరవుతుంది.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన అభ్యర్థి

రాజానగరం: గత సార్వత్రిక ఎన్నికలలో రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, ఓటమి చెందిన రాయపురెడ్డి ప్రసాద్ (చిన్న) వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం జగ్గంపేట మండలం ఇర్రిపాక వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ద్వారా కలుసుకున్నారు. పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపడంతో ఆయనను సీఎం జగన్ సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, యువ నాయకుడు జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు.

చిన్న రాక పార్టీకి బలం: జక్కంపూడి గణేష్

ప్రకాశం నగర్: రాయపురెడ్డి చిన్న రాకతో వైఎస్సార్ సీపీకి మరింత బలం చేకూరిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గణేష్ మాట్లాడుతూ 30 ఏళ్ళుగా తమ తండ్రి జక్కంపూడి రామ్మోహనరావుకు వెన్నంటి ఉండి పనిచేసిన రాయపురెడ్డి చిన్న బుధవారం ఇర్రిపాకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో జనసేనకు పెద్ద షాక్ తగిలినట్లు అయిందన్నారు. చిన్న తమ సొంత మనిషి అన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు



విలేకరులతో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్. పక్కన రాయపురెడ్డి చిన్న

మరణం అనంతరం కూడా తమతో కలిసి పయనించడమే కాకుండా స్థానిక కంబాలచెరువు వద్ద జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాన్ని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారన్నారు. చిన్నకు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో మంచి కేడర్ ఉందని, సొంత సొమ్ము ఖర్చు చేసి ఎంతోమందికి సహకారం అందించారన్నారు. అటువంటి నాయకుడు ఇప్పుడు తమ పార్టీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరింత భారీ మెజారీతో రాజానగరంలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే టీడీపీ, ఇతర పార్టీల నుంచి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులుగా పనిచేసినవారు పెద్ద ఎత్తున పార్టీలో చేరనున్నారని తెలిపారు. త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహించి తమ సత్తా చాటుతామన్నారు. ఈ బహిరంగ సభలో తాము నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి నివేదిను ప్రజల ముందు ఉంచుతామన్నారు. తమ పార్టీ నుంచి ఒకరు బయటకు వెళితే నలుగురు పార్టీలోకి వస్తారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సంక్షేమ పాలనకు ఆకర్షితుడనై పార్టీలో చేరాను : రాయపురెడ్డి చిన్న

రాయపురెడ్డి చిన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితుడనై వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. వచ్చే ఎన్నికల్లో జక్కంపూడి రాజా అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. తాను జక్కంపూడి కుటుంబంలో ఒక సభ్యుడినేనని అనివార్య కారణాలతో బయటకు వెళ్లానన్నారు. తనను స్వయంగా సీఎం జగన్ వద్దకు తీసుకువెళ్లి వైఎస్సార్ సీపీ కండువా వేయించిన గణేష్‌కు అభినందనలు తెలిపారు. పార్టీ కోసం పనిచేయండి .మీకు తగిన ప్రాధాన్యం ఇస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో తనకు అనేక ఇబ్బందుల ఎదురయ్యాయని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బంది ఎదురుకాలేదని అన్నారు. ఇకపై నియోజకవర్గంలో ఒక్క ఓటుకు నలుగురం పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో దాట్ల పృథ్వీరాజ్, కోరుకొండ మండం పార్టీ ఉపాధ్యక్షుడు ఉల్లి గణ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



Services

BUSINESS OFFER



■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221531]

■ MLM / నెట్వర్క్ / డైరెక్ట్ సెల్లింగ్ ఇండస్ట్రీతో లైఫ్ సెటిల్‌మెంట్ కొరకు ఎదురుచూస్తున్న లీడర్స్‌కు స్వాగతం. వై.వి.రావు, 99591 87147. [M-1221604]

GOLD FINANCE



■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6114]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిర ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999 [B-6053]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788219]



Wanted

■ రాజమండ్రి, కొంతమూరు, నామవరంలో ప్ర॥ కం॥ ATMs, షోరూమ్స్, స్టార్ హోటల్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్వైజర్స్ కావలెను. జీ॥12 to 15 వేలు. రూం+భో. రాజీ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. 99922 69969 [R-90]

■ జాబ్ గ్యారంటీ 18-50సం॥ల మహిళలు, పురుషులు అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+ భోజనం, జీతం: 25000/-వేల వరకు. ఫోన్ : 9966310431 [HA-10956]

■ హైదరాబాద్ స్టార్ హోటల్స్‌లో ఫుడ్ సర్వీస్‌కి క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూమ్+ఫుడ్ ఫ్రీ. జీతం: 18000-24000/- స్పా, జా॥ Ph: 9381979061 [HA-2081]

■ గుంటూరు హోమ్ హెల్త్ కేర్ సర్వీసెస్. శ్రీమంతుల ఇళ్ళలో పేషెంట్స్‌ను చూసుకొనుటకు ఆడ మగ స్టాఫ్ కావలెను. జీ: 15000/- to 25,000/- ఫ్రీఫుడ్+రూమ్. 9392442511, 8142767696 [G-751545]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/Fఆయా,నర్సులు, వంటచేయు వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 12000-35000/-,ఫ్రీరూమ్+భోజనం.Hyd.ఫోన్ :7995984445. [HA-564]

■ Wanted Male Marketing incharges, Class incharges and Admission incharges. Qualification: Any Degree. Salary: 12,000/- to 25,000/- (experienced Candidates preferable) Age Limit: 25 to 45, Job Location: Master Minds College, Rajahmundry. Contact: 9248733370 [G-4595]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైఫిల్ షూటింగ్ పోటీలలో డీఎస్‌ఏ క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన డీఎస్‌ఏ క్రీడాకారులతో కోచ్ సమీర్

నాగమల్లితోట జంక్షన్: జాతీయ క్రీడాదినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ సంఘం నిర్వహించిన రైఫిల్ షూటింగ్ పోటీలలో కాకినాడ డీఎస్‌ఏ క్రీడాకారులు ప్రతిభను కనబరిచారు. డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ కోచ్ సమీర్ వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారుల్లో అండర్-14లో ఎంహెచ్ అభిషేక్, ఆర్‌వీఎస్ హరిగోపాల్, జి.వర్షంత్, అండర్-17లో ఎస్‌కే మోహియుద్దీన్, ఎంఎంఎస్ దీపక్, కేపీ గౌతమ్, అండర్-19లో ఎస్‌కే నాజు, కె.సాయితమ్మయి, ఎం.సామ్యూల్ బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్ సమీర్‌ను డీఎస్‌ఏ సీఈఓ రమణి, చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్ బుధవారం అభినందించారు.



జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్‌కు షేక్‌మోహియుద్దీన్

భోపాల్‌లో త్వరలో జరిగే జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు కాకినాడ డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న షేక్ మోహియుద్దీన్ ఎంపికయ్యాడని కోచ్ సమీర్ బుధవారం తెలిపారు. మోహియుద్దీన్ కేరళలో ఆగస్టు 17 నుంచి 22 వరకు జరిగిన సౌత్‌జోన్ పోటీలలో ప్రతిభను కనపరిచి క్వాలిఫై అయ్యాడని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో ఐదు మెడల్స్ సాధించాడు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి



ప్రమాదంలో మృతిచెందిన సతీష్ (ఫైల్)

మధురపూడి: కోరుకొండ సచివాలయం-2 వలంటీర్, ఉత్తమ సేవారత్న అవార్డు గ్రహీత మామిళ్లపల్లి కాశీ సూర్య సుబ్రహ్మణ్య అచ్యుత సంతోష్ కుమార్ (35) బుధవారం కోరుకొండలో ఆర్టీసీ బస్సు ఢీ కొని మృతి చెందాడు. మృతుడు సంతోషకు భార్య, తల్లి, తండ్రీ, తమ్ముడు, మరదలు ఉన్నారు. వలంటీర్ బాధ్యతతో పాటు, పౌరోహిత్యం చేస్తున్న సంతోష్ జంభూపట్నంలోని ఓ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. నర్సాపురం రోడ్డుపై మోటార్ సైకిల్‌పై వస్తున్న సంతోష్ కోరుకొండ బస్ స్టాండ్ సమీపంలోని కాలువపైనున్న వంతెనపైకి ఎక్కుతుండగా ప్రమాదం జరిగింది. బస్సు టైర్లు కాళ్లపైకెక్కగా నుజ్జు నుజ్జయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో సంతోష్ సొమ్మసిల్లిపడిపోయాడు, అతని స్థానికులు అంబులెన్స్ సహకారంతో హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. టిఫిన్ చేయకుండా వెళ్లి, కానరాని లోకాలకు వెళ్లిన భర్త మృతదేహాన్ని చూసిన భార్య గాయత్రి గుండెలు బాదుకుంటూ రోదించింది. తమకంటే ముందే కొడుకు అకాల మృతి చెందడంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏటా తనతో రాఖీ కట్టించుకొనే అన్నయ్య రక్షా బంధన్ పండగ రోజున మృతి చెందాడంటూ సతీష్ పినతల్లి కుమార్తె విలపించడం చూపరులకు కంట తడి పెట్టించింది. కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే జక్కంపూడి సంతాపం

మామిళ్లపల్లి సంతోష్‌కుమార్ మృతికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సంతాపం తెలిపారు. ఉత్తమ సేవలందిస్తున్న సంతోష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీరని లోటన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో మహారాష్ట్ర భక్తులు

- దత్తాత్రేయ స్వామికి రాఖీలు కట్టిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు
- క్యూ కట్టిన మహారాష్ట్ర భక్తులు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలం కావడంతో పిఠాపురంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. వేలాది మంది భక్తుల తరలిరావడంతో దత్తాత్రేయుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దత్తాత్రేయునికి రాఖీలు కట్టడం ఆనవాయితీగా ఉండగా ఈ ఏడాది సుమారు 20 వేల మంది వరకు మహారాష్ట్రీయులు తరలిరావడంతో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పిఠాపురంలో పేరొం



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారికి రాఖీలు కడుతున్న భక్తులు

దిన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో బుధవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్తులు, అర్చకులు స్వామివారికి రాఖీలు కట్టారు. పిఠాపురంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన పాదగయ శ్రీకుక్కుటేశ్వరస్వామి వారి ఆలయలంలో వేంచేసియున్న దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దుర్గాడ శివాలయంలో స్వామి అమ్మవార్లకు రుద్ర సహిత, శ్రీసూక్త సంపుటీకరణతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి లలితా సహస్ర నామ కుంకుమార్చనలు చేశారు. రాఖీ పౌర్ణమి ఉత్సవాలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.

రత్నగిరిపై రేపు సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం

- ఉదయం ఎనిమిది గంటల నుంచి సత్యదేవుని వార్షిక కల్యాణ మంటపంలో
- సుమారు ఆరు వేల మంది మహిళలు హాజరవుతారని అంచనా
- కల్యాణ మంటపం సరిపోక పోతే రెండో బ్యాచ్ వ్రత మంటపాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు



శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించే సత్యదేవుని వార్షిక కల్యాణ మంటపం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో శ్రావణ మాస మూడో శుక్రవారం పర్వదినం సందర్భంగా రామాలయం వద్ద గల వార్షిక సత్యదేవుని కల్యాణ మంటపంలో 'సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ బుధవారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఈ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సుమారు ఆరువేల మంది మహిళలు వచ్చే అవకాశం ఉండడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. వార్షిక కల్యాణ మంటపం సరిపోకపోతే దానితో బాటు వ్రత మంటపాలలో కూడా ఈ వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ వ్రతమాచరించే మహిళలు కేవలం గాజులు, పూలు, అరటి పండ్లు, రెండు కొబ్బరికాయలు తెచ్చుకోవాలి. మిగిలిన పూజాద్రవ్యాలన్నీ దేవస్థానమే అందజేయనుంది. కార్యక్రమానికి హాజరయ్యే మహిళలకు లక్ష్మీదేవి రూపు, తోరం, ప్రసాదం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనం, అనంతరం అన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గత శుక్రవారం కూడా స్వామివారి నిత్యకల్యాణ మంటపంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అయితే రెండో శుక్రవారం కావడంతో మహిళలు ఎవరి ఇళ్లవద్ద వారే వరలక్ష్మీ వ్రతం నిర్వహించడంతో పెద్దగా హాజరు కాలేదు. ఈ శుక్రవారం భారీ సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమానికి విచ్చేస్తారన్న అంచనాతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.

సెప్టెంబర్ ఎనిమిదో తేదీన కూడా...

కాగా, శ్రావణ మాస నాలుగో శుక్రవారం సందర్భంగా సెప్టెంబర్ ఎనిమిదో తేదీన కూడా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. రామాలయం పక్కన గల సత్యదేవుని వార్షిక కల్యాణ మంటపంలో చేయిస్తామని తెలిపారు.